## డాక్టర్ రెడ్డీస్‌కి ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్‌కు స్వల్ప ఊరట లభించింది. హైదరాబాద్‌లో సంస్థకున్న ఆర్అండ్‌డీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించిన అమెరికా నియంత్రణ మండలి..ఈ సెంటర్‌లో లోపాలు ఉన్నాయి కానీ చర్యలు తీసుకోబోమని స్పష్టంచేసింది. ఈ లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. ఇందుకు సంబంధించి వాలంటరీ యాక్షన్ ఇండికేటెడ్(వీఏఐ)ను జారీ చేసింది. హైదరాబాద్‌లోని బాచుపల్లి వద్ద ఉన్న ఆర్అండ్‌డీ సెంటర్‌ను గతేడాది డిసెంబర్‌లో తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో కంపెనీ షేరు ధర 2.56 శాతం బలపడి రూ.6,310 వద్ద ముగిసింది.

## పానసోనిక్ నయా ఏసీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: పానసోనిక్ ఒకేసారి దేశీయ మార్కెట్లోకి 60 మాడళ్లను విడుదల చేసింది. వీటిలో అత్యధికంగా ఇన్వర్టర్ ఏసీలేనని పేర్కొంది. వచ్చేది వేసవికాలం కావడంతో ఈసారి ఉష్ణోగ్రత అధికంగా ఉంటుందన్న అంచనాలను వాతావరణ శాఖ విడుదల చేయడంతో ఏసీల తయారీ సంస్థలు నూతన మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమయ్యాయి. ఐవోటీ ప్లాట్‌ఫాంపై విడుదల చేసిన ఈ ఏసీలు కొన్ని సెకండ్లలోనే సెటప్ చేసుకోవచ్చును. ముఖ్యంగా కస్టమర్లు తమ నెట్‌వర్క్, స్మార్ట్ స్పీకర్లతో కనెక్ట్ చేసుకోవచ్చును కూడా.

## సెయిల్ డివిడెండ్ రూపాయి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సెయిల్ రూపాయి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 20న చెల్లింపులు జరపనున్నట్లు సెయిల్ చైర్మన్ అమరేందు ప్రకాశ్ తెలిపారు. గత త్రైమాసికంలో సంస్థ 4.75 మిలియన్ టన్నుల క్రూడ్ స్టీల్‌ను ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.23,492 కోట్ల ఆదాయంపై రూ.422.92 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 22 శాతం తగ్గగా, అటు ఆదాయంలోనూ గండిపడింది.

# పడకేసిన పారిశ్రామికోత్పత్తి



### డిసెంబర్‌లో వృద్ధిరేటు 3.8 శాతానికే పరిమితం

### గనులు, విద్యుదుత్పత్తి రంగాల ప్రదర్శన పేలవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి పడకేసింది. గత ఏడాది డిసెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 3.8 శాతంగానే ఉన్నట్టు సోమవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల్లో తేలింది. 2022 డిసెంబర్‌లో ఐఐపీ 5.1 శాతంగా ఉండటం గమనార్హం. గనులు, విద్యుదుత్పత్తి రంగాల ప్రదర్శన పేలవంగా ఉన్నట్టు గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ రిపోర్టులో వచ్చింది. నిజానికి తయారీ రంగంలో ఉత్పత్తి 3.9 శాతానికి పెరిగింది. ఏడాది క్రితం 3.6 శాతమే. అయినప్పటికీ గనుల రంగంలో ఉత్పాదకత అంతకుముందుతో పోల్చితే 10.1 శాతం నుంచి 5.1 శాతానికి, విద్యుదుత్పత్తి రంగంలో 10.4 శాతం నుంచి 1.2 శాతానికి దిగజారడం దెబ్బతీసింది. ప్రైమరీ గూడ్స్‌లోనూ 8.5 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. మౌలిక, నిర్మాణ రంగ ఉత్పత్తుల్లోనూ వృద్ధి 11 శాతం నుంచి 4.1 శాతానికి దిగొచ్చింది. కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి సైతం 2022 డిసెంబర్‌తో పోల్చితే 2023 డిసెంబర్‌లో 7.9 శాతం నుంచి 2.1 శాతానికి పడిపోయింది. కన్జ్యూమర్ డ్యూరబుల్స్ ఔట్‌పుట్ కూడా 11.2 శాతం నుంచి 4.8 శాతానికి తగ్గింది. క్యాపిటల్ గూడ్స్ విభాగంలోనూ వృద్ధి 3.2 శాతానికే పరిమితమైంది. 2022 డిసెంబర్‌లో 7.8 శాతంగా ఉన్నది.

### రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతం

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల 3 నెలల కనిష్ఠంగా నమోదైంది. ఆహారోత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడం వల్లే జనవరిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత చిల్లర ద్రవ్యోల్బణం 5.1 శాతానికి దిగొచ్చినట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) తెలిపింది. అంతకుముందు నెల 5.69 శాతంగా ఉండగా, గత ఏడాది జనవరిలో 6.52 శాతంగా ఉన్నది. నిరుడు ఆగస్టులో గరిష్ఠంగా 6.83 శాతంగా ఉన్న సంగతి విదితమే. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) లక్ష్యం 4 శాతంగా ఉన్నది. ద్రవ్యోల్బణం అదుపులో లేనందునే కీలక వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిలోనే కొనసాగిస్తున్నది.




# ఈ-స్కూటర్లపై 18 వేల రాయితీ

### ప్రత్యేక ఆఫర్ ప్రకటించిన ఒకాయా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రముఖ ఈ-స్కూటర్ల సంస్థ ఒకాయా..కొనుగోలుదారులు బంపర్ ఆఫర్ ప్రకటించింది. కంపెనీకి చెందిన అన్ని రకాల స్కూటర్లపై రూ.18 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్ ఈ నెల చివరి వరకు అందుబాటులో ఉండనున్నదని కంపెనీ ఎండీ అన్షుల్ గుప్తా తెలిపారు. ధరలు అధిక స్థాయిలో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొనుగోలుదారులకు ఆర్థిక ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో సింగిల్ చార్జింగ్‌తో 74 కిలోమీటర్లు ప్రయాణించే స్కూటర్ ధర రూ.74,899కి తగ్గగా, అలాగే 140 నుంచి 160 కిలోమీటర్లు ప్రయాణించే ఫాస్ట్ ఎఫ్4 మాడల్ రూ.1,19,990కి తగ్గనున్నది. ధరలు తగ్గించకముందు ఇది రూ.1,37,990గా ఉన్నది. ఎఫ్3 మాడల్ రూ.1,24,990 నుంచి రూ.1,09,990కి దిగిరానుండగా, మోటోఫాస్ట్ మాడల్ రూ.1,41,999 నుంచి రూ.1,28,999కి, ఫాస్ట్ ఎఫ్2ఎఫ్ మాడల్ రూ.93,999 నుంచి రూ.83,999కి, ఫాస్ట్ ఎఫ్2బీ మాడల్ రూ.1,02,950 నుంచి రూ.93,950కి దించింది.

## ఫుల్‌క్రమ్ డిజిటల్‌లో 700 ఉద్యోగాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: డిజిటల్ ఇంజినీరింగ్, బిజినెస్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ ఫుల్‌క్రమ్ డిజిటల్ భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. కృత్రిమ మేధస్సుకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో ఈ ఏడాది కొత్తగా 700 మంది సిబ్బందిని నియమించుకోవాలనుకుంటున్నట్టు కంపెనీ చైర్మన్ రాజేశ్ సిన్హా తెలిపారు. బిగ్ డాటాబేస్‌ను మరింత సరళతరం చేయాలనే ఉద్దేశంతో సంస్థ ఇటీవల రైజ్, జనరేటివ్ ఏఐ ప్లాట్‌ఫాం సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. డాటా సైంటిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, కృత్రిమ మేధస్సుపై పట్టున్న వారిని భారత్‌తోపాటు విదేశాల్లో రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించారు. న్యూయార్క్ చెందిన డిజిటల్ సంస్థ ఫుల్‌క్రమ్‌కు భారత్‌తోపాటు అమెరికా, లాటిన్ అమెరికా, యూరప్‌లలో కార్యాలయాలు ఉన్నాయి.



## అన్ని రకాల సహకారాలు అందిస్తాం

### దుబాయి కేర్స్ సీఈవోతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం సచివాలయంలో దుబాయి కేర్స్ సీఈవో వైస్ చైర్మన్ తారిఖ్ అల్ గర్గ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యా రంగంలో మార్పులకోసం పనిచేస్తున్న దుబాయి కేర్స్ సంస్థ అధినేతను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని, పెట్టుబడులు పెట్టే సంస్థలకు స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థ పురోగమనానికి తాము చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్ బాబుకు తారిఖ్ గర్గ్ వివరించారు. దేశాల్లో విద్యాభివృద్ధికి తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తున్నదని, మొదటి దశలో భాగంగా భారత్‌తో సహా 10 దేశాల్లో విద్యారంగం పురోగమించడం కోసం గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ యాక్సిలరేటర్(జీఈఎస్ఈ)ను ప్రారంభించామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి సాధికారిత కల్పించడం తమ లక్ష్యమన్నారు.

# రూ.231 లక్షల కోట్లు

- దేశంలోని టాప్ 500 ప్రైవేట్ సంస్థల విలువ
- భారత జీడీపీలో 71 శాతానికి సమానం
- హురున్-యాక్సిస్ రిపోర్టులో వెల్లడి
- రూ.15.65 లక్షల కోట్లతో రిలయన్స్ టాప్

ముంబై, ఫిబ్రవరి 12: దేశంలోని టాప్ 500 ప్రైవేట్ రంగ సంస్థల విలువ రూ.231 లక్షల కోట్లు (2.8 ట్రిలియన్ డాలర్లు)గా ఉన్నట్టు సోమవారం విడుదలైన హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ 2023 అత్యంత విలువైన సంస్థల జాబితా స్పష్టం చేసింది. ఇది సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, సింగపూర్ దేశాలన్నిటి జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. అలాగే భారత జీడీపీ విలువలో 71 శాతానికి సమానమని కూడా ఈ రిపోర్టు పేర్కొన్నది. ఇక గత ఏడాదికిగాను వచ్చిన ఈ నివేదికలో స్టాక్ మార్కెట్లలో నమోదైనవి, కాని కంపెనీలూ ఉన్నాయి.




### మూడోసారి రిలయన్సే

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) దేశంలోనే అత్యంత విలువైన ప్రైవేట్ రంగ సంస్థ అని తాజా రిపోర్టు పేర్కొన్నది. నిరుడు అక్టోబర్ నాటికి దీని విలువ రూ.15.65 లక్షల కోట్లుగా ఉన్నది. దీంతో వరుసగా మూడో ఏడాదీ రిలయన్స్‌కే అగ్రస్థానం దక్కింది. రూ.12.4 లక్షల కోట్లతో రెండో స్థానంలో దేశీయ ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్ ఉండగా, రూ.11.3 లక్షల కోట్లతో మూడో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నది. హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనం ఇందుకు కలిసొచ్చినట్టు హురున్ ఇండియా ఎండీ అనాస్ రెహ్మాన్ జునైద్, యాక్సిస్ బ్యాంక్ ఎండీ అమితాబ్ చౌధరి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

### ముంబై టాప్

ఈ టాప్ 500 ప్రైవేట్ రంగ సంస్థలు దేశంలోని 44 నగరాలకు చెందినవి. అయితే ఇందులో అత్యధికం దేశ వాణిజ్య రాజధాని ముంబైకి చెందినవే. 156 ఉన్నాయి. బెంగళూరుకు చెందినవి 59 ఉండగా, న్యూఢిల్లీకి చెందినవి 39 ఉన్నాయి. కాగా, వాల్యూ క్రియేటర్లలో సుజ్లాన్ ఎనర్జీ వాల్యూ గ్రోత్ గరిష్ఠంగా 436 శాతంగా ఉన్నది. మేఘా ఇంజినీరింగ్ వాల్యూ గ్రోత్ 150 శాతం. జాబితాలో 76 ఆర్థిక సేవల సంస్థలున్నాయి. తర్వాతి స్థానంలో ఆరోగ్య సంరక్షణ (58), కన్జ్యూమర్ గూడ్స్ (38) రంగాల కంపెనీలున్నాయి.

- దేశంలోని టాప్ 500 ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్నవారు 70 లక్షలపైనే.
- భారత్‌లోని ఉద్యోగుల్లో ఇది 1.3 శాతానికి సమానం.
- 437 సంస్థల బోర్డుల్లో మహిళలున్నారు.
- జాబితాలో అత్యంత ప్రాచీన సంస్థ ఈఐడీ-పర్రీ. 235 ఏండ్ల కింద మొదలైంది.
- ప్రారంభమై పదేండ్లు కాకున్నా భారతీయ టాప్ 500 ప్రైవేట్ సంస్థల్లో చోటు దక్కించుకున్నవి 52.
- మళ్లీ టాప్ 10లోకి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కొటక్ మహీంద్రా బ్యాంక్.
- 28వ స్థానంలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్
- 2022తో పోల్చితే పెరిగిన 342 సంస్థల విలువ. రెట్టింపైన 18 సంస్థల విలువ.
- నిరుడు రూ.1,000 కోట్ల విలువ పెరిగిన సంస్థలు 250 ఉండగా, రూ.10,000 కోట్లు పెరిగినవి 75.
- రూ.లక్ష కోట్లు పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఐటీసీ విలువ.

## కోల్ ఇండియా లాభం రూ. 9,069 కోట్లు

### మధ్యంతర డివిడెండ్ షేరుకు రూ.5.25

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కోల్ ఇండియా నికరలాభం 2023 డిసెంబర్ త్రైమాసికంలో 17 శాతం వృద్ధిచెంది రూ. 9,069 కోట్లకు చేరింది. కోల్ ఇండియా మార్కెట్లో లిస్టయిన తర్వాత ఒక త్రైమాసికంలో ఇంత లాభాన్ని సంపాదించడం ఇదే ప్రథమం. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలానికి రూ.7,755 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 3 శాతం వృద్ధిచెంది రూ.35,169 కోట్ల నుంచి రూ.36,154 కోట్లకు చేరింది. ముగిసిన త్రైమాసికంలో బొగ్గు ఉత్పత్తి 11 శాతం పెరిగి 19.9 కోట్ల టన్నులుగా నమోదయ్యింది. సోమవారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు షేరుకు రూ.5.25 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను సిఫార్సుచేసింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ మొత్తం డివిడెండ్ రూ.20.50కి చేరింది. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో)గా ముకేశ్ అగర్వాల్ నియామకాన్ని బోర్డు ఆమోదించింది.

## టాబ్లెట్ పీసీల్లో యాపిల్ హవా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశీయ టాబ్లెట్ పీసీ మార్కెట్లో యాపిల్ హవా కొనసాగుతున్నది. గతేడాది, డిసెంబర్ త్రైమాసికంలోనూ సంస్థ 25 శాతం మార్కెట్ వాటాతో తొలి స్థానంలో నిలిచిందని సర్వే వెల్లడించింది. అలాగే సామ్‌సంగ్ 23 శాతం మార్కెట్ వాటాతో ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు సైబర్‌మీడియా రీసర్చ్ తాజాగా వెల్లడించింది. కానీ, అంతక్రితం ఏడాది డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన దాంతో పోలిస్తే యాపిల్ ట్యాబ్లెట్ పీసీ మార్కెట్ 17 శాతం తగ్గింది. 24 శాతం మార్కెట్ వాటాతో లెనోవా రెండో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా టాబ్లెట్‌కు డిమాండ్ అధికంగా ఉండటం, ముఖ్యంగా ప్రీమియం, 5జీ, వాల్యూ-ఫర్-మనీ టాబ్లెట్లు ఆఫర్లు ఇస్తుండటం కూడా ఇందుకు కలిసొచ్చింది. రూ.20 వేల నుంచి రూ.30 వేల లోపు ధర కలిగిన టాబ్లెట్లు ప్రీమియంగా గుర్తిస్తున్నది.



# బేర్‌మన్న బ్యాంకింగ్ షేర్లు

### మెటల్ షేర్లూ అమ్మకాల ఒత్తిడిలోనే

### లాభాల స్వీకరణ వైపు మదుపరులు

### నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 523, నిఫ్టీ 166 పాయింట్లు పతనం

ముంబై, ఫిబ్రవరి 12: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం సూచీలు లాభాల్లోనే మొదలైనా.. సమయం గడుస్తున్నకొద్దీ నష్టాల్లోకి జారుకున్నాయి. మదుపరులు లాభాల స్వీకరణకు పెద్ద పీట వేయగా.. బ్యాంకింగ్, మెటల్ రంగాలు, కొన్ని చమురు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హెవీ వెయిట్ షేర్ రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఇన్వెస్టర్లను ఆకట్టుకోలేకపోయింది. ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 523 పాయింట్లు లేదా 0.73 శాతం క్షీణించి 71,072.49 వద్ద నిలిచింది. అయితే ఒకానొక దశలో సూచీ 71,756.58 పాయింట్లకు పెరిగినా నిలబడలేకపోయింది. అలాగే మరో దశలో 70,922.57 పాయింట్లకు పడిపోయినా తిరిగి కోలుకున్నది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 166.45 పాయింట్లు లేదా 0.76 శాతం పతనమై 21,616.05 వద్ద స్థిరపడింది. 'ఫార్మా, ఐటీ రంగాలు మినహా అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనైతే ఇది మరింతగా ఉన్నది. మదుపరులు దాదాపు అన్ని పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లను అమ్మకానికి పెట్టారు' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు.

### రంగాలవారీగా..

క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లు కుప్పకూలాయి. వీటిలో యుటిలిటీస్ సూచీ గరిష్ఠంగా 3.60 శాతం పడిపోయింది. రియల్టీ 3.01 శాతం, పవర్ 2.90 శాతం, ఇండస్ట్రియల్స్ 2.92 శాతం, ఎనర్జీ 2.80 శాతం, మెటల్ 2.73 శాతం, చమురు-గ్యాస్ 2.56 శాతం చొప్పున క్షీణించాయి. కంపెనీలవారీగా.. టాటా స్టీల్ అత్యధికంగా 2.76 శాతం నష్టపోయింది. ఎన్టీపీసీ 2.72 శాతం, ఎస్బీఐ 2.26 శాతం మేర దిగజారాయి. ఇండస్ఇండ్, కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.16 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 2.62 శాతం చొప్పున క్షీణించాయి.

### గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా దేశాల సూచీల్లో జపాన్, చైనా లాభాల్లో ముగిశాయి. హాంకాంగ్ మాత్రం నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో ఫ్రాన్స్, జర్మనీ సూచీలు లాభాల్లో.. బ్రిటన్ సూచీ నష్టాల్లో ఉన్నది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 0.50 శాతం తగ్గి 81.78 డాలర్లుగా ట్రేడ్ అయ్యింది. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) శుక్రవారం భారతీయ ఈక్విటీ మార్కెట్లలో రూ.141.95 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్టు ఎక్స్ఛేంజీ గణాంకాలు చెప్తున్నాయి. నాడు సెన్సెక్స్ 167.06 పాయింట్లు, నిఫ్టీ 64.55 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే.




# టాప్-5 ఈవీలివే

- రూ.11- 40 లక్షల లోపు ధర కలిగిన మాడళ్లు
- ఈ ఏడాదిలో మార్కెట్లోకి విడుదల చేసిన సంస్థలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్ వాహనాలకు పెద్దపీట వేసిన కొనుగోలుదారులు ఇక ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి సారిస్తున్నాయి. ఇంధన ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో కొత్తగా కార్లను కొనుగోలు చేసేవారు ఈవీలకు ఓటు వేస్తున్నారు. ఇటీవలకాలంలో వీటి అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతుండటంతో ఆటోమొబైల్ సంస్థలు కూడా వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. దీంట్లోభాగంగా నూతన సంవత్సరంలో రూ.11 లక్షల నుంచి రూ.40 లక్షల లోపు ధర కలిగిన టాప్-5 ఎలక్ట్రిక్ కార్లు ఇవే..




### సిట్రాయిన్ సీ3ఎక్స్

*సిట్రాయిన్ సెడాన్ సీ3ఎక్స్‌ను ఎలక్ట్రిక్ వెర్షన్‌లో విడుదల చేయబోతున్నది. ఈ ఏడాది చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు ధర రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల మధ్యలో ఉండనున్నది. 44 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 350 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. ఆరు వరకు ఎయిర్‌బ్యాలలు, రివర్స్ కెమెరా వంటి ఫీచర్స్‌తో రూపొందించింది.*



### మారుతి సుజుకీ ఈవీఎక్స్

*మారుతి సుజుకీ తన తొలి ఈవీ మాడల్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నది. ఈ ఏడాది చివర్లో అందుబాటులోకి రానున్న ఈ ఎస్‌యూవీ మాడల్ ఆటో క్లైమేట్ కంట్రోల్ వంటి అధునాతన ఫీచర్స్‌తో తయారు చేస్తున్నది. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఈఎస్‌సీ, డ్రైవర్ అసిస్టెన్స్ ఫీచర్, ఆటో ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్ కలిగిన ఈ కారు రూ.22 లక్షల నుంచి రూ.28 లక్షల మధ్యలో ధర ఉండొచ్చును.*



### మహీంద్రా ఎక్స్‌యూవీ ఈ8

*మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మధ్యస్థాయి, ఎక్స్‌యూవీ 700ని ఈవీ రూపంలో ఎక్స్‌యూవీ.ఈ8ని అందుబాటులోకి తీసుకురాబోతున్నది. రెండు బ్యాటరీలు 60 కిలోవాట్లు, 80 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యం కలిగిన ఈ మాడల్ రూ.35-40 లక్షల మధ్యలో ధర ఉండనున్నది.*



### టాటా పంచ్ ఈవీ

*టాటా మోటర్స్.. సరికొత్త ఈవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే కలిగిన ఈ మాడల్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీలు తిరిగే కెమెరా, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 421 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ కారు రూ.11 లక్షల నుంచి రూ.15.5 లక్షల గరిష్ఠ స్థాయిలో లభించనున్నది.*




### టాటా కర్వ్..

*టాటా సరికొత్త ఈవీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈవీల పరిధిని మరింత విస్తరించే ఉద్దేశంలో భాగంగా నూతన కర్వ్ ఈవీ మాడల్‌ను తీర్చిదిద్దింది. 30 కిలోవాట్ల నుంచి 40.5 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో ఈ మాడల్‌ను తయారు చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్న ఈ మాడల్ రూ.20-25 లక్షల ధరల్లో లభించనున్నది.*

## పేటీఎం బ్యాంక్‌పై చర్యల్ని వెనక్కు తీసుకోం

### సమగ్ర విశ్లేషణ తర్వాతే నిషేధించాం ● ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై తాము ప్రకటించిన చర్యల్ని సమీక్షించే ప్రసక్తే లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంతదాస్ స్పష్టం చేశారు. ఫిబ్రవరి 29 తర్వాత పేటీఎం బ్యాంక్ డిపాజిట్లు తీసుకోరాదని, కస్టమర్ ఖాతాలు, వ్యాలెట్లలో టాప్ అప్స్. ఫాస్ట్‌ట్యాగ్స్, ప్రీపెయిడ్ సాధనాలు ఇవ్వరాదంటూ జనవరి 31న ఆర్బీఐ నిషేధ చర్యల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆర్బీఐ సెంట్రల్ డైరెక్టర్ల బోర్డు 606వ సమావేశం అనంతరం సోమవారం శక్తికాంతదాస్ మీడియాతో మాట్లాడుతూ 'పేటీఎంపై మా నిర్ణయాన్ని సమీక్షిస్తామని మీరు (మీడియా) భావిస్తున్నట్టయితే ఒకటి స్పష్టంగా చెప్పదలుచుకున్నా, నిర్ణయాన్ని సమీక్షించేదే లేదు' అని కుండబద్దలు కొట్టారు. ఆర్బీఐ నియంత్రణలో ఉన్న సంస్థలపై సమగ్రంగా విశ్లేషించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని దాస్ చెప్పారు. ఫిన్‌టెక్ రంగానికి ఆర్బీఐ మద్దతుగా నిలుస్తుందని, ఇదే సమయంలో ఖాతాదారుల ప్రయోజనాల్ని సంరక్షించడం, ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడానికి కట్టుబడి ఉంటుందని వివరించారు.




### విత్‌డ్రాయిల్స్‌కు అనుమతి

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) నిర్వహించే కొన్ని కార్యకలాపాల్ని నిలిపివేస్తున్నప్పటికీ, మరికొన్నింటిని ఆర్బీఐ అనుమతించింది. ఫిబ్రవరి 29 తర్వాత కూడా ఫిబ్రవరి 29 పీపీబీఎల్ ఖాతాదారులు వారి వివిధ ఖాతాల్లో (సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫాస్ట్‌ట్యాగ్స్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు) బ్యాలెన్స్‌ను ఎటువంటి నియంత్రణలు లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చు. ఇతరత్రా వాడుకోవచ్చు. బ్యాంక్ తన కస్టమర్ల ఖాతాల్లో వడ్డీ జమచేయవచ్చు.

### ఈ వారంలో ఎఫ్ఏక్యూ

పేటీఎం అంశంపై తలెత్తే సందేహాలు, వాటికి సమాధానాల్ని వివరిస్తూ ఈ వారంలో ఎఫ్ఏక్యూల సెట్‌ను (ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చన్స్) రిజర్వ్‌బ్యాంక్ విడుదల చేయనుంది. పీపీబీఎల్ కస్టమర్లకు సంబంధించిన వివిధ అంశాలతో వివరణల జాబితాతో కూడిన ఎఫ్ఏక్యూ సెట్‌ను తీసుకొస్తామని ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. ఖాతాదారులు ఇబ్బందులకు లోనుకాకూడదన్నదే తమ ప్రాధాన్యత అని, వారి ప్రయోజనాలు తమకు చాలా ముఖ్యమని చెప్పారు.